క్లుప్తంగా

మట్టి గణపతినే పూజిద్దాం


వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న అప్పలరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: వినాయక చవితి రోజు మట్టితో చేసిన గణనాథుని విగ్రహాలనే పూజించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు గొందేశి అప్పలరెడ్డి అన్నారు. పెదగంట్యాడ ఈఎస్‌ఐ ఆస్పత్రి వద్ద జీఏఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత గొందేశి అప్పలరెడ్డి, శ్రీదేవి ఆధ్వర్యంలో 300 మందికి మట్టి ప్రతిమలను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ప్రసాద్ రెడ్డి, ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూత్ హాస్టల్స్ అసోసియేషన్ వితరణ


అనాథ పిల్లలతో యూత్ హాస్టల్స్ ప్రతినిధులు

ఉక్కునగరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం అనాథ పిల్లలకు వివిధ వస్తువులు అందజేశారు. యూత్ హాస్టల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గాజువాకకు చెందిన జనరేషన్ యువ ఆశ్రమానికి వెళ్లి అక్కడా పిల్లలకు సబ్బులు, టూత్ బ్రష్‌లు, టూత్‌పేస్టులు, పెన్సిళ్లు, వాషింగ్ పౌడర్, ఫేస్ పౌడర్ తదితర వస్తువులు అందజేశారు. యూనిట్ అధ్యక్షుడు ఆర్.వి.వి.ఎస్. జగపతిరాజు పిల్లలకు భోజనం నిమిత్తం రూ. 2500 ఆశ్రమం నిర్వాహకులకు ఇచ్చారు. కార్యక్రమంలో యూనిట్ చైర్మన్ వి.ఆర్.కె. రాజు, ఉపాధ్యక్షులు భాస్కరరాజు, అసోసియేషన్ సీనియర్ సభ్యుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో రికార్డుల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న కుమార్‌రాజు

పెదగంట్యాడ: మండలంలోని శాఖా గ్రంథాలయాన్ని విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వార్షిక రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ శాతం ధరావతు సభ్యులను చేర్చాలన్నారు. చదువు అంటే మాకిష్టం కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

పెదగంట్యాడ: ఏమి జరిగిందే ఏమో ఓ మైనర్ బాలిక ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని సంజీవ కాలనీకి చెందిన 13 ఏళ్ల బాలిక మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా రూ. 20 వేలు నగదు, 4జతల బట్టలు పట్టుకుని ఇంటి నుంచి వెళ్లిపోయిందని బాలిక తల్లి న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. న్యూపోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే బాలిక వెళ్లిపోతూ ఒక ఉత్తరం రాసిందని..తనకోసం ఎవరూ వెతకొద్దని తనకు బతకాలని లేదని ఓ లేఖరాసి ఇంట్లో ఉంచి వెళ్లినట్లు సమాచారం.

రైలు ఫుట్‌గార్డు తగిలి వ్యక్తి మృతి

ట్రాక్‌పై నిర్వహణ పనులు చేపడుతుండగా ప్రమాదం



అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్ సమీపంలోని తలారివానిపాలెం ఎదురుగా రైల్వే ట్రాక్‌పై ఇంజినీరింగ్ నిర్వహణ పనులు నిర్వహిస్తుండగా రైలు ఫుట్‌గార్డు తగిలి కాంట్రాక్ట్ కార్మికుడు మృతిచెందాడు. దువ్వాడ జీఆర్‌పీ సిబ్బంది తెలిపిన వివరాలు.. దువ్వాడ రైల్వేస్టేషన్‌కు సమీపంలోని తలారివానిపాలెం ఎదురుగా సోమవారం ట్రాక్ పనులు చేస్తుండగా రైలు వెళ్తున్న క్రమంలో ఢీకొంది. ఈ సంఘటనలో అక్కడ పనులు నిర్వహిస్తున్న కొత్తవలస మండలం దేవాడ ప్రాంతానికి చెందిన కోన అప్పలనాయుడు (57)కు ఫుట్ గార్డు తగిలింది. వెంటనే సిబ్బంది అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మన గణేశుడు.. అందరి వాడు

విదేశాల్లో వినాయకుడి చిత్రాలతో నాణేలు, స్టాంపులు

వాటిని సేకరించిన కణితికాలనీ వాసి



తువాలు దేశం విడుదల నాణెం


కేమరూన్ దేశం విడుదల చేసిన 500ఫ్రాంక్





ఇండోనేషియా విడుదల చేసిన రూ.20వేల విలువైన కరెన్సీ

కూర్మన్నపాలెం: విఘ్నాలను తొలగించేవాడే వినాయకుడు అని, జ్ఞానానికి, బుద్ధికి అధిపతి అని హిందువులు భావిస్తారు. అందువల్లే ఏ నూతన కార్యక్రమం తలపెట్టినా వినాయకుడి పూజతో ప్రారంభిస్తారు. అయితే ప్రపంచంలోని మరికొన్ని దేశాల్లో కూడా గణేశుడిని ఆరాధిస్తారని చరిత్ర చెబుతోంది. ఆయా దేశాలు అధికారికంగా నాణేలు, స్టాంపులు కూడా విడుదల చేసి ఆదిదేవుడిపై ఉన్న భక్తిని చాటుకున్నాయి.

గణేశుడి రూపంతో ముద్రణలు ఇలా..

- ఇండోనేషియా1998లో రూ. 20వేల నోటు ముద్రించింది. వినాయకుడితో నోటు ముద్రించిన ఏకైక దేశంగా ఇండోనేషియా గుర్తింపుపొందింది.
- థాయిలాండ్ 2011లో బయోమెటల్‌తో వినాయకుడి కాయిన్ విడుదల చేసింది.
- ఆస్ట్రేలియా 2018లో అపురూపమైన నాణేన్ని రూపొందించి విడుదల చేయడం గమనార్హం. గణపతి నటరాజులా ఒక కాలుపై నిల్చొని నృత్యం చేస్తున్నట్లు కన్పించేలా నాణేన్ని విడుదల చేశారు.
- ఆఫ్రికా ఖండంలో గల ఐవర్ కోస్టు అనే దేశం గణేషుని చిత్రంతో నాణేన్ని 2013లో ముద్రించింది.రావి ఆకును పోలే విధంగా తయారు చేశారని నాణేల ప్రేమికుడు ప్రగడ గోవిందరాజులు తెలిపారు.
- కమేరూన్ దేశం కూడా 2023లో 50 ఫ్రాంకుల వెండితో గణనాథుని చిత్రంతో నాణేన్ని విడుదల చేసి ఆది దేవుడిపై ఆ దేశానికి ఉన్న భక్తిని చాటుకుంది.


వినాయకుని చిత్రంతో విడుదల చేసిన నాణెం

- తువ్వార్ దేశంతే 2013లో ఎలుకను వాహనంగా చిత్రీకరించి దానిపై వినాయకుడు ఆశీనులైనట్లుగా రూపొందించారు. అప్పట్లోనే దాని విలువ భారత కరెన్సీ ప్రకారం ఎనిమిది వేల రూపాయల పైబడి ఉంది. ప్రస్తుతం అయితే రూ.30 వేలకు పైగా ఉంటుందని అంటున్నారు.

అన్ని గణనాథుడి కరెన్సీకి కేరాఫ్ గోవిందరాజులు

ఇలా చాలా దేశాలు విడుదల చేసిన వినాయకుడి నాణేలు, స్టాంపులను జీవీఎంసీ 87వ వార్డుకు చెందిన ప్రగడ గోవిందరాజులు సేకరిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్ట్ కార్మికుడే అయినా కొత్త నాణేల సేకరణ హాబీగా మార్చుకున్నారు. ఇప్పటికే వివిధ దేశాలు ముద్రించిన నాణేలు, స్టాంపులను ఆయన సేకరించి భద్ర పరిచారు. ఇందులో గణపతి చిత్రంతో వివిధ దేశాలు ముద్రించిన నాణేలు సేకరించిన గోవిదరాజులును పలువురు అభినందిస్తున్నారు.

చిన్ననాటి నుంచే ఆసక్తి



నేను ఐటీఐ మాత్రమే చదివాను. చిన్నప్పటి నుంచి నాణేలు సేకరించడంపై ఆసక్తి ఉండేది. అది గమనించిన మాతాత నన్ను ప్రోత్సహించాడు. ఇప్పటికే చాలా నాణేలు సేకరించాను. ఆదిదేవుడైన వినాయకుడి వివిధ రూపాల్లో పలు దేశాలు ముద్రించిన నాణేల సేకరణపై దృష్టి పెట్టాను. భావి తరాలకు తెలియ చెప్పేందుకే నేను నాణేలు సేకరించే ప్రయత్నం చేస్తున్నాను.

– ప్రగడ గోవిదరాజులు, నాణేల సేకర్త, కణితికాలనీ

అధినేతను కలిసిన దేవన్‌రెడ్డి


జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దేవన్‌రెడ్డి కుటుంబం

గాజువాక: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆ పార్టీ గాజువాక సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి మంగళవారం కుటుంబ సమేతంగా కలిశారు. భార్య ఎమిలి జ్వాల, కుమార్తె, కుమారుడితో తాడేపల్లి వెళ్లిన దేవన్‌రెడ్డి పార్టీ కేంద్ర కార్యాలయంలో అధినేతను కలుసుకున్నారు. ఈ సందర్భంగా జగన్ మోహన్‌రెడ్డి వారితో సరదాగా మాట్లాడారు. గాజువాకలో రాజకీయ పరిస్థితులను దేవన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

తొలిపూజకు సిద్ధం


పూజాసామగ్రి కొనుగోలు చేస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: వినాయక చవితి ఉత్సవాలు బుధవారం నుంచి వైభవంగా ప్రారంభం కానునున్నాయి. గణపతిని కొలిచేందుకు అందరూ సిద్ధమయ్యారు. పూజకు అవసరమైన వివిధ రకాల పత్రి, పూలు, పండ్లు, కొనుగోలు చేశారు. పెదగంట్యాడ కూడలి, వుడా కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో, గంగవరం, నమ్మిదొడ్డి జంక్షన్, మదీనాబాగ్ సెంటర్‌లో పూజ సామాగ్రి విక్రయాలు చేశారు. వ్యాపారులు పూజ సామగ్రి ధరలు విపరీతంగా పెంచేశారు. తప్పని పరిస్థితుల్లో ఎంత వెచ్చించైనా కొనుగోలు చేయాల్సి వచ్చిందని ప్రజలు నిట్టూర్చారు.

ఉత్సవ ఏర్పాట్లకు హైరానా

- తెరిపిలేని వర్షంతో అవస్థలు
- అనుకున్న రీతిలో సిద్ధంకాని మండపాలు
- మరోపక్క చిరు వ్యాపారులకూ దెబ్బ


లంకా మైదానంలో మండపం వద్ద వర్షం వల్ల ఇలా..

గాజువాక: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో గణపతి ఉత్సవాల నిర్వాహకులు హైరానా పడ్డారు. గాజువాక నియోజకవర్గంలో నెల రోజులుగా గణపతి ఉత్సవాల ఏర్పాట్లలో ఉత్సవ కమిటీల ప్రతినిధులు బిజీబిజీగా ఉన్నారు. మండపాలకు తుది మెరుగులు దిద్దాల్సిన సమయంలో సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తుండంతో మండపాల ఏర్పాటు చేయడానికి ఇబ్బందులు పడ్డారు. అప్పటికే మండపాల కోసం వేసిన పందిళ్లు నానిపోయాయి. కర్రలపై కప్పిన టార్పన్లు వర్షంతో పాటు వీస్తున్న గాలికి ఎగిరిపోయాయి. మండపాలకు అలంకరణ చేయడానికి సైతం వర్షం ఆటంకంగా నిలిచింది. వాటి ముందు రంగులతో వివిధ రూపాల్లో మండపాలను అలంకరిస్తుంటారు. ఆ అలంకరణ చేయలేక ఎక్కువ మండపాలను బోసిగా వదిలేశారు. బుధవారం వర్షం లేకపోతే పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత అయినా మండపాలను అలంకరించుకోవచ్చంటూ కొందరు నిర్వాహకులు నిర్ణయించుకొన్నారు. కాగా మంగళవారం సాయంత్రం 4 గంటల తర్వాత వరుణుడు కరుణించడంతో నిర్వాహకులతో పాటు వ్యాపారుల్లో ఆనందం కనిపించింది.


కూర్మన్నపాలెంలో ఏర్పాట్లు చేసుకొంటున్న నిర్వాహకులు

800 మండపాలు

నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో 800కు పైగా వినాయక మండపాలు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆయా మండపాలు అన్నింటికీ వరుణుడు విఘ్నంగా నిలిచాడు. మండపాల ముందు విద్యుత్ దీపాల అలంకరణ కూడా అనుకున్న రీతిలో చేయలేకపోయారు.


గాజువాక మార్కెట్‌లో కొనుగోలుదార్ల కోసం వర్షంలో వేచి చూస్తున్న వ్యాపారి

వ్యాపారాలు వెలవెల

వర్షం కారణంగా చిరు వ్యాపారాలు వెలవెలబోయాయి. వినియోగదార్లు లేక దుకాణాలు బోసుపోయాయి. గాజువాక, పెదగంట్యాడ, చినగంట్యాడ, కూర్మన్నపాలెం, అగనంపూడి తదితర ప్రాంతాల్లో రోడ్ల పక్కన తోపుడు బళ్లపై పెట్టి వినాయక ప్రతిమలు, పూజకు పత్రి, మొక్క జొన్న పొత్తులు, జామ కాయలు, వెలగ కాయలు తదితర వాటితో పాటు వినాయక వ్రతానికి సంబంధించిన పూజా సామగ్రిని విక్రయానికి సిద్ధం చేశారు. వర్షం కారణంగా ఆయా దుకాణాల్లో సామగ్రి కోసం వెళ్లే వినియోగదార్ల రద్దీ తగ్గిపోయింది. అయినా పూజా సామగ్రి, పత్రులు, పండ్ల ధరలు మాత్రం దడదడలాడించాయి.

పూల ధరకు రెక్కలు

వినాయక చవితి సందర్భంగా పూలు, టెంకాయల ధరలు పెరిగిపోయాయి. రెండు రోజుల వరకు కిలో రూ.200 నుంచి 250 వరకు ఉండే పలు రకాల పూలు ధరలు రెట్టింపయ్యాయి. గులాబీలు, చామంతి, బంతి పూలు మిక్సింగ్ 100 గ్రాములు రూ.50, కిలో రూ.500 చొప్పున విక్రయించారు. వీటితో పాటు దాలియా పువ్వు ఒకటి రూ 10, కలువ పువ్వు ఒకటి రూ.20 చొప్పున విక్రయించారు. వీటికి తోడు ప్రతి ఒక్కరు వినాయకుడి వద్ద వినియోగించే కొబ్బరికాయలు సైజును బట్టి రూ.35, రూ 40, రూ 50 చొప్పున విక్రయించారు.


వర్షానికి గణపతి విగ్రహాలు తడిసిపోకుండా కప్పిన కవర్లు


వర్షం తగ్గడంతో గాజువాక మార్కెట్‌లో కొనుగోలుదారుల సందడి

దంచికొట్టిన వాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పొంగి పొర్లిన గెడ్డలు
- చెరువులను తలపించిన రోడ్లు

పెదగంట్యాడ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర ప్రభావం చూపింది. సోమవారం రాత్రి చిన్నగా మొదలైన వర్షం అర్ధరాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు దంచికొట్టింది. దీంతో జన జీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గెడ్డలు, కాలువలు పొంగిపొర్లాయి. రహదారులన్నీ చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలైన బర్మా కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీ, డెయిరీ కాలనీ, రిక్షా కాలనీ, రామచంద్రనగర్, 77వ వార్డు పరిధి పెదపాలెంలోని గెడ్డ పొంగిపొర్లడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. రోడ్లన్నీ జలమయం కావడంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు సాగించలేకపోయారు. ఒక వైపు వినాయక చవితిని పురస్కరించుకొని పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దయాల్‌నగర్, రాజీవ్‌నగర్ మార్గ్, భానోజీ కాలనీ తదితర కొండవాలు ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఒకే రీతిన వర్షం పడడంతో ఏక్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందారు. దయాల్‌నగర్ కొండపై వర్షం ధాటికి రాళ్లు, మట్టి పెళ్లలు విరిగి ఇళ్లపై పడేలా ఉండడంతో ప్రాణాలను అర చేతిలో పెట్టుకున్నారు.


పెదపాలెంలో వరదనీటిలోనే రాకపోకలు

కూలిన ప్రహరీ : జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వాంబే కాలనీ కొండపై వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రహరీ కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.


చెరువును తలపిస్తున్న సీతానగరం రోడ్డు


65వ వార్డు వాంబే కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కూలిన ప్రహరీ